
## జాతీయస్థాయి శిక్షణ కార్యక్రమానికి ఎంపికైన బక్రిచెప్యాల విద్యార్థి మీర్జా సపూర

**సిద్దిపేట అర్బన్, మే 15, ప్రభాతవార్త :** కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఎన్ఈపి 2020లో భాగంగా ప్రేరణ కార్యక్రమాన్ని ప్రారంభించి దేశంలోని అన్నిజిల్లాల నుంచి జిల్లాకు ఇద్దరుచొప్పున(ఒక అమ్మాయి, ఒక అబ్బాయి) ఎంపికచేసి గుజరాత్ రాష్ట్రంలోని వాద్‌నగర్‌లో వారం రోజుల పాటు అనుభవ పూర్వక అభ్యాసన విధాన ద్వారా శిక్షణను అందించనున్నారు. అందుకుగానూ జిల్లా స్థాయి ఎంపిక పోటీలను జిల్లా నోడల్ పాఠశాలగా ఉన్న జవహర్ నవోదయ పాఠశాల వర్గల్‌లో గత ఏప్రిల్ 8న నిర్వహించడం జరిగింది. పోటీలలో ప్రభుత్వ, జిల్లాపరిషత్, ప్రైవేటు, మోడల్ స్కూల్స్, కేజీబీవీ, గురుకుల పాఠశాలల నుంచి 9 నుంచి ఇంటర్ చదివే విద్యార్థులు పాఠశాల నుంచి ఇద్దరు చొప్పున పాల్గొన్నార. విభిన్న అంశాలలో రెండంచెల పరీక్ష నిర్వహించగా బక్రిచెప్యాల జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి విద్యార్థి మీర్జా సపూర ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు డి.నాగేందర్‌రెడ్డి,గైడ్ టీచర్ పూర్ణచందర్‌రావులు తెలిపారు. సపూరను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, పాఠశాల సిబ్బంది అభినందించారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## వందశాతం ఉత్తీర్ణత సాధించిన నవోదయ విద్యార్థులు

**వర్గల్, మే 15 (ప్రభాతవార్త):**

సిబిఎస్ఈ 10వ తరగతి, 12వ తరగతి పరీక్షల్లో వర్గల్ నవోదయ విద్యాలయం విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి, 12వ తరగతి చదువుతున్న నవోదయ విద్యార్థులకు మార్చి, ఏప్రిల్ నెలల్లో సిబిఎస్ఈ బోర్డు వార్షిక పరీక్షలు నిర్వహించగా ఈ పరీక్షల్లో విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులు అయ్యారని పేర్కొన్నారు. 10వ తరగతిలో 74 మంది, 12వ తరగతిలో 33 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా ఉత్తీర్ణులు అయ్యారన్నారు. 10వ తరగతిలో అనిమేశ్‌దాస్ 500 మార్కులకు గానూ 478 మార్కులు సాధించి విద్యాలయ టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. ఎం.సింధు కేతకి 476 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. 12వ తరగతిలో మేఘన సౌమ్య 500 మార్కులకు గానూ 450 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలువగా ఎల్.యాదగిరి 448 మార్కులు సాధించి ద్వితీయ స్థానం, సాయితేజ 418 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.



ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఓ

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిఎం అండ్ హెచ్ఓ

**బెజ్జంకి, మే 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో గల ప్రాథమిక అరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అయన అసుపత్రిలోని రికార్డులను తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. ఎప్పటికప్పుడు పూర్తి స్థాయిలో రికార్డులను నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ అసుపత్రికి వచ్చి నిరుపేదలకు అరోగ్య పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ అసుపత్రిలో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం అమలు చేస్తున్న అరోగ్య పరమైన పథకాలను సద్వినియోగం చేసుకునేలా వివరించాలన్నారు. నూతనంగా చేపట్టిన అసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్‌ను అదేశించారు. అయన వెంట డిప్యూటి డిఎంహెచ్ఓ శ్రీనివాస్, ప్రాథమిక అరోగ్య కేంద్రం వైద్యాధికారి డా॥ కృష్ణతేజ సూపర్‌వైజర్ కళావతి, సిబ్బంది అనురాధ తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలి

**సిపిఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి**



మాట్లాడుతున్న సిపిఎం కార్యదర్శి సత్తిరెడ్డి

**కొమురవెల్లి, మే 15, ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొనుగోలు కేం ద్రాలలో గన్ని బ్యాగుల కొరతతో కొనుగోళ్లల్లో అలస్యం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గన్ని బ్యాగుల కొరత ఉన్నప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో కొనుగోలు కేం ద్రాలలో రైతులు ధాన్యం అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసిన సహించేది లేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో రైతులు వేసవి కాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో వేసవి కాలం దృష్ట్యా రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు తాడూరి రవీందర్, అత్తిని శారద, తేలు ఇస్తారి, నీల బిక్షపతి,అరుట్ల రవి, తాడూరి మల్లేశం, పుల్లంపల్లి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## సప్తాహం ఉత్సవంలో పాల్గొన్న ఎంపి బిబి పాటిల్



సిర్గాపూర్‌లో సప్తాహం ఉత్సవంలో ఎంపి బిబి పాటిల్ తదితరులు

**సిర్గాపూర్, మే 15 ప్రభాతార్త:** మండలకేంద్రంలో హనుమాన్ మందిరంలో కొనసాగుతున్న సప్తహం ఉత్సవ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపి బిబిపాటిల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిబిపాటిల్‌కు ఆలయ కమిటీ బాధ్యులు సాదరంగా స్వాగతం పలకగా అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటి బాధ్యులు బిబి పాటిల్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జన్వాడ సంగప్ప, మాజీ ఎంపిటిసి సభ్యులు రాజ్ కుమార్ సిగ్రే తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివిలో అడ్మిషన్‌లకు దరఖాస్తులు ఆహ్వానం

**మనూర్, మే 15, ప్రభాతవార్త:** మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో విద్యను ఆర్జించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేశ్వరి తెలిపారు. పాఠశాలలో 6వ తరగతిలో 40 సీట్లు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు రెండు నుంచి ఐదు ఖాళీలు ఉన్నాయన్నారు. ప్రశాంత వాతావరణంలో స్వంత భవనంలో కొనసాగుతున్న పాఠశాలలో ప్రణాళిక బద్దంగా విద్యా బోధన అందిస్తున్నామన్నారు. పాఠశాలలో 10వ తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు, విద్యార్థిని నికిత 10 జిపిఏ సాధించిందని గుర్తు చేశారు. పాఠశాలలో చేరి మంచి విద్యను అందుకోవాలని, అర్హులు సకాలంలో ధరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజేశ్వరి సూచించారు.

## పేదలకు ఆర్థిక సహాయం అందజేత

**నంగునూర్, మే 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో బుధవారం ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు చక్రధర్‌గౌడ్ ఆధ్వర్యంలో పేద కుటుంబానికి చెందిన శామంతుల మల్లవ్వకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే గ్రామంలో ఇటీవల అనా రోగ్యంతో మృతి చెందిన మల్లవ్వ కుటుంబానికి 50 కిలలో బియ్యం అంద జేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు రంగు అశోక్‌గౌడ్, దండవేణి రాజేందర్, ఐలయ్య,బోగి శ్రీనివాస్,వరడోలు శ్రీనివాస్, సాగర్,సందబోయిన రవి, గుండెల్లి కొమురయ్య,దున్నపోతుల సంపత్, గీకురు రాజు, ఏటి భిక్షపతి, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేసినవారిని కఠినంగా శిక్షించాలి

**జిల్లా రెవెన్యూ అధికారికి ఉపాధ్యాయుల వినతి**



జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణికి వినత పత్రం అందచేస్తున్న ఉపాధ్యాయులు

**సంగారెడ్డి టౌన్, మే 15, ప్రభాతవార్త:**

నారాయణఖేడ్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగిన ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన ఆర్‌డిఓ, సిఐ, ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన పిఓ, ఎపిఓ, ఓపిఓలకు ఒకేవిధంగా రెమ్యూనరేషన్ చెల్లించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందని, అందుకు అనుగుణంగా తమకు రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకే పోలీసులతో ఆర్‌డిఓ లాఠీ చార్జి చేయించడం సమాజంపై దాడిచేయడం లాంటిదని మండిపడ్డారు. ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేసిన బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు వై.జ్ఞానమంజరి,బి.సాయిలు, నాగారం శ్రీనివాస్, సయ్యద్ సాబెర్ అలీ, గుండు లక్ష్మణ్, అనుముల రాంచందర్, శుభాన్‌సింగ్, దుర్గయ్య, లక్ష్మయ్యయాదవ్, పి.శ్రీనివాసరావు, సోమశేఖర్, ఎం.శామయ్య, భాస్కర్, విజయ్‌భాస్కర్,బి.సాయితేజ, పాండురంగారెడ్డి, ఆర్.శ్యాంప్రసాద్, పుండరీకం, జి.ప్రభాకర్, సంతోష్‌కుమార్, పత్రి కిషన్, గోపాల్, పి.నరేందర్, యాదయ్య, భూమి శ్రీనివాస్, సాయిలు, మొగులయ్య, నాగేశ్వర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిఎస్‌యుటిఎఫ్ నాయకులు

**ఉపాధ్యాయులపై లాఠీచార్జీకి కారకుడైన**

## ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలి

**టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు**

**నర్సాపూర్, మే 15, ప్రభాతవార్త :**

ఉపాధ్యాయులపై లాఠీచార్జీ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జీ చేయడాన్ని ఆయన ఖండించారు. బుధవారం టిఎస్‌యుటిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయు లపై లాఠీచార్జీ చేసిన ఆర్డీవో, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని పివో, ఏపివోలకు రోజుకు 6 వందలు, ఓపివోలకు 4వందలు రాష్ట్ర ప్రభుత్వం జివో నెంబర్ 691ని ఈనెల 11న విడుదల చేసిందన్నారు. ఆ ఉత్తర్వుల ప్రకారం మెదక్ నియోజకవర్గ పరిధిలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్ నియోజక వర్గాల్లో పిఓ, ఏపివోలకు రూ. 3,150 చెల్లించగా నారాయణఖేడ్‌లో రూ. 2400 ఇచ్చారన్నారు. ఈసీ ఆదేశాలకు విరుద్ధంగా సంగారెడ్డి జిల్లాలో 5 అసెంబ్లీ సెగ్మెంట్‌లలో తక్కువపారితోషికాన్ని చెల్లించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఒకే పార్లమెంట్ నియోజకవర్గంలో రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, జిల్లా నాయకులు సాయితేజ, కేశవరావు, ప్రభాకర్, సుధాకర్, అనురాధ తదితర ఉపాధ్యాయుల, ఉద్యోగులపై ఆర్డీవో ఆదేశాలమేరకు పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేసి గాయపరిచారన్నారు. నిబంధనలను పాటించకుండా ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యంచేసిన ఆర్డీవో, సిఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ చరణ్‌రెడ్డి, పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రవి, ఎస్‌కె.నాగూల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తదితరులు

## డ్రైనేజీ మరమ్మతు పనులను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్

**నర్సాపూర్, మే 15, ప్రభాతవార్త :** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలువార్డుల్లోని డ్రైనేజీలకు మరమ్మతు పనులను చేపట్టారు. బుధవారం 5వ వార్డు, 13వ వార్డుల్లో కొనసాగుతున్న డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ గాంధీ విగ్రహం వద్ద మెయిన్ రోడ్డు పక్కన గల మురికి కాలువ చాలా కాలంగా ఓపెన్ డ్రైనేజీ ఉన్నందున ప్రజలకు ఎన్నో ఇబ్బందులు కలిగాయన్నారు. ఈ డ్రైనేజీ మరమ్మతు పనులు చేపట్టామని తెలిపారు. ఈ పనులను స్వయంగా పరిశీలిస్తున్నట్లు ఆయన చెపాపరు. 5వ, 13వ వార్డుల్లోగల డ్రైనేజీ మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయిస్తానని అశోక్‌గౌడ్ తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్ ఆంజనేయలుగౌడ్, టిఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్‌యాదవ్, నర్సింలు, ప్రజలు నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది తదితరులున్నారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి విజయం ఖాయం

**రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్, రఘువీరారెడ్డి**

**నర్సాపూర్ మే 15, ప్రభాతవార్త :** దేశంలో జరిగిన, జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అత్యదిక స్థానాల్లో విజయం సాధించి తిరిగి అధికారం చేపడుతుందని ఆ పార్టీ నేతలు వాల్దాస్ మల్లేష్‌గౌడ్, రఘువీరారెడ్డి అన్నారు. బుధవారం బిజెపి కార్యాలయంలో వారు మాట్లాడుతూ దేశంలో ప్రధాని నరేంద్ర మోడి చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు ప్రజలు, యువకులు, రైతులు అందరూ ఆకర్షితులై బిజెపికి ఈ ఎన్నికల్లో అత్యధికంగా ఓట్లు వేశారన్నారు. నరేంద్రమోడి పరిపాలన ప్రపంచదేశాలకు ఆదర్శంగా ఉందని ఆయా దేశాల నేతలు మెచ్చుకుంటున్నారని తెలిపారు. కాగా మెదక్ పార్లమెంట్ స్థానంలో బిజెపి ఎంపి అభ్యర్థి రఘునందన్‌రావు విజయం ఖాయమన్నా ధీమాను వారు వ్యక్తం చేశారు. ఈమేరకు ఈపార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి పార్టికి అకుంఠిత దీక్షతో పని చేసిన నాయకులకు, కార్యకర్తలకు, ఓట్లు వేసిన ప్రజలకు వారు ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యనరకమంలోబిజెపి రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్, రఘువీరారెడ్డి లతో పాటు ఓబిసి జిల్లా పాధ్యక్షులు గుండం శంకర్, కన్వీనర్ ఎల్లం, ఎరుకలిసంఘం జిల్లా అధ్యక్షులు బిక్షపతి,జిల్లా కార్యవర్గ సభ్యులు బాదె బాలరాజు, వెల్యేకన్నె మాజీ సర్పంచ్ రాజెందర్,మండల బిజెపి ఉపాధ్యక్షులు బాలరాజు, ప్రదాన కార్యదర్శి నాగేశ్‌గౌడ్, బిజెవైఎం నాయకులు అరవింద్‌గౌడ్ వాల్దాస్, నాయకులు, శక్తి కేంద్రం ఇంచార్జులు, భూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి నాయకులు మల్లేష్‌గౌడ్, రఘువీరారెడ్డి



కొడిపల్లిలోని అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై సలహాలు, సూచనలు ఇస్తున్న డిఈవో రాధాకిషన్ తదితరులు

## జూన్ 5లోగా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి : డిఈవో రాధాకిషన్

**కొడిపల్లి, మే 15, ప్రభాతవార్త :** జూన్ 5లోగా అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తిచేయాలని డిఈవో రాధాకిషన్ అన్నారు. బుధవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఎఎపిసి) పనుల సందర్శనలో భాగంగా డిఈవో రాధాకిషన్ కొడిపల్లి మండలంలలోని యుపిఎస్ సదాశివపల్లి, ఎంపిపిఎస్ భూరుగడ్డ పాఠశాలలను సందర్శించి పలు సూచనలు చేశారు. కొడిపల్లి మండలంలో మొత్తం 38 పాఠశాలలు ఎంపిక కావడం జరిగిందన్నారు. అన్ని పాఠశాలలు జూన్ 5వ తేదీలోగా తాగునీరు, ఎలక్ట్రిసిటీ, టాయిలెట్స్ రిపేర్ పనులు పూర్తి చేయాలన్నారు. పనులు చేయడానికి ఇప్పటివరకు అన్ని పాఠశాలలకు 25 శాతం డబ్బులు అడ్వాన్స్‌గా జమచేయడం జరిగిందన్నారు. గైడ్‌లైన్స్ ప్రకారం వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సుదర్శనమూర్తి, ఏఎస్ఓ నవీన్‌కుమార్, పాఠశాలల ప్రధానోపాధ్యాయయులు యాదగిరి, ఓం ప్రకాష్, బుచ్చిరెడ్డి, ఏఈ రవిమోహన్, పంచాయతీసెక్రటరీ రేణుర, వివో కవిత, ఎంఐఎస్ ఆంజనేయులు, సిఆర్‌పి మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ కళాశాలలో ప్రవేశానికి ధరఖాస్తులు ఆహ్వానం

**సంగారెడ్డి టౌన్, మే 15, ప్రభాతవార్త:** 2024-25 విద్యా సంవత్సరానికిగాను కార్పొరేట్ కళాశాలలో ప్రవేశానికి ఎస్‌సి, ఎస్టీ, బిసి, పిహెచ్‌సి, మైనార్టీ, ఈబిసి విద్యార్థులు ఆన్‌లైన్ ద్వార ప్రవేశానికి ధర ఖాస్తులు చేసుకోవాలని ఉప సంచాలకులు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిటి అఖిలేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2024 లో 10వ తరగతిలో ఉత్తీర్ణులై జిపిఏ 7.0 ఆపైన సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో సంబంధిత పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్పొరేట్ కళాశాలలో ప్రవేశానికి ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, తెలంగాణ రెసిడెన్సియల్ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, బెస్ట్ అవైలబుల్, నవోదయ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు, పథకం కింద చదివిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులు అన్నారు. మే 30వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఇ అఖిలేష్‌రెడ్డి సూచించారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**కొహెడ, మే 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన మృతుల కుటుంబాలను కరుమ సంఘం మండల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు బుధవారం పరామర్శించారు. తీగలకుంటపల్లె గ్రామా నికి చెందిన కూకట్ల కొమురయ్య, పరివేద గ్రామానికి చెందిన బొప్పన పల్లి ఐలయ్య, లక్ష్మీపురం గ్రామానికి చెందిన బండారి లక్ష్మీ వివిధ కార ణాలచే మరణించగా బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. అనంతరం కురుమ సంఘం అధ్వర్యంలో బాధిత కుటుంబాలకు 50 కిలలో బియ్యం అందజేశారు. మండలంలోని కుర్మలకు ఎలాంటి ఇబ్బం దులు వచ్చిన అండగా నిలుస్తామని మండల కురుమ సంఘం అధ్య క్షులు, ఎంపిటిసి కోనే శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో కురుమ సంఘం ప్రతినిధులు కూకట్ల శ్రీశైలం, మీస కొమురయ్య, ఇరు రాజయ్య, చిగురు రాజమల్లయ్య, గుడ్ల సమ్మయ్య, భూమల కనకయ్య,దయ్యాల మహేందర్, తీగలకుంటపల్లి. పరివేద,లక్ష్మీపూర్ గ్రామాల కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.



స్వామి మృతదేహాన్ని పరిశీలిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

## ఉరేసుకుని ఆటోడ్రైవర్ ఆత్మహత్య

**మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ప్రతాప్‌రెడ్డి**

**గజ్వేల్, మే 15 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డుకు చెందిన ఆటో డ్రైవర్ పసుల స్వామి ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థికసహాయం అందించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ స్వామి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో స్థానిక కౌన్సిలర్ గంగిశెట్టి చందన రవీందర్, బిఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు గడియారం స్వామిచారి, శేఖర్ తదితరులు ఉన్నారు.

**స్వామి మృతి బాధాకరం: గాడిపల్లి అనూఫ్**

గజ్వేల్ పట్టణంలోని 11వ వార్డుకు చెందిన పసుల స్వామి ఉరివేసుకొని మృతిచెందగా అతని కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు గాడిపల్లి అనూఫ్ పరామర్శించి ఆర్థికసహాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునేలా చూస్తానన్నారు.

**ఏడాదిగా జీతం రాక...పొగ చిమ్ని ఎక్కి**

## కార్మికుడి ఆత్మహత్యా యత్నం

**-మంత్రి హామీతో సమస్య పరిష్కారం**

**జహీరాబాద్, మే 15, ప్రభాతవార్త:**

ఏడాదిపాటు జీతం అందక మనస్థాపానికి గురైన కార్మికుడు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన మండల పరిధిలోని కొత్తూర్(బి) గ్రామంలోని ట్రైడెంట్ చక్కర కర్మాగాంలో బుధవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కర్మాగారంలో పనిచేస్తున్న రమేష్ బాబు కు ఏడాది కాలంగా కర్మాగార యాజమాన్యం జీతం చెల్లించకపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై బుధవారం కర్మాగారంలోని పొగ వెళ్లే చిమ్నిపైకి ఎక్కి ఆత్మహత్యా యత్నం చేశాడు. ఇది గమనించిన స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు, కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో సంఘటన స్థలానికి చేరుకున్నారు. పట్టణ సిఐ ఆర్.రవి, రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, తహసీల్దార్ ఎస్ రవీందర్ అధికారులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని విషయాన్ని ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబుతో ఫోన్‌లో ఫిలిం డెవలప్‌మెంట్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి మాట్లాడారు. అప్పటికప్పుడే మంత్రి శ్రీధర్‌బాబు కర్మాగార యాజమాన్యంతో మాట్లాడి కార్మికుడు రమేష్ బాబుకు రావాల్సిన బకా యిలు చెల్లించేందుకు యాజమాన్యం సై అనడంతో కార్మికుడు చిమ్నిపై నుంచి కిందకి దిగివచ్చాడు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరసింహారెడ్డి, కార్మిక సంఘం నాయకులు ఎంజి రాములుయాదవ్, కొత్తూర్(బి) మాజీ సర్పంచ్ జగన్మోహన్‌రెడ్డి, కర్మాగారం అధికారులు పాల్గొన్నారు.



కార్మికుడి సమస్యను పరిష్కరించిన ఎఫ్‌డిసి చైర్మన్ గిరిధర్‌రెడ్డి

# కనుల పండువగా ముగిసిన వేసవి శిక్షణా శిబిరం




శిక్షణ తీసుకున్న చిన్నారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేసిన సినీనటుడు సంపూర్ణేష్‌బాబు తదితరులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

బాల్యంలోనే నచ్చిన అంశాన్ని ఎంపిక చేసుకొని శిక్షణ, సాధనలతో రాటుతేలితే జాతీయస్థాయిలో గుర్తింపుపొ ఒదడానికి అవకాశం ఉంటుందని సినిమా హీరో స ంపూర్ణేష్ బాబు అన్నారు. సిద్దిపేట వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణశిబిరం ముగింపు ఉత్సవం జిల్లా కేంద్రం లోని విపంచి కళా నిలయంలో కనుల పండుగగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. నైతిక విలువలు, భగ వద్గీత శ్లోకాలు, అబాకస్, కర్రసాము, చిత్రలేఖనం. చేతిరాత, నీతి కథలు, నృత్యం తదితర అంశాల్లో శిక్షణపొందిన పిల్లలు తమ అదు భుతమైన ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా సినిమా హీరో సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ సిద్దిపేట అన్ని రంగాల్లో పురోగమించడం సంతోషంగా ఉందన్నారు. పిల్లల్లో ఎంతో శక్తి దాగి ఉంటుందని దానిని గుర్తించి వెలికి తీయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందన్నార. సినిమా నటులు సిల్వర్ సురేష్ మాట్లాడుతూ సృజానాత్మక రంగాల్లో మెరవడానికి ప్రస్తుతం ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు.జర్నలిస్టు దేవికరెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులకు మన సంస్కృతి సాంప్రదాయాలను నేర్పాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకున్న చిన్నారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు పరమేశ్వర్, విక్రంరెడ్డి, యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సొసైటీ,యుటిఎంఎ ప్రతినిధులు అంజయ్య, తోట అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, తోట సంధ్య, తోట సతీష్, చిప్ప ప్రభాకర్, గంగాపురం శ్రీనివాస్, రాజ్‌కుమార్, రవి, అనిల్, సురేష్, మనీషా,

# మేయర్ అధ్యక్షతన 25వ సాధారణ సర్వసభ్య సమావేశం

**నిజాంపేట్, మే 15, ప్రభాతవార్త**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం సమావేశం హాలలో బుధవారం మేయర్ కోలన్ నీలాగోపాల్‌రెడ్డి అధ్యక్షతన డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కమీషనర్ రామకృష్ణరావు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి 25వ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజాం పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 33 డివిజన్ల పరిధిలో కావాల్సిన మౌలిక సదుపాయాలు, పెండింగ్ దశలో ఉన్న పనులు, నీళ్ల, రోడ్లు, డ్రైనేజీ వంటి పలు సమస్యలు, వాటి పరిష్కారం కోసం తీసుకోవలసిన చర్యలు వంటి పలు కీలక ప్రధాన అంశాలపై పలు సలహాలు, సూచనలతో చర్చా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కార్పోరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, వాటర్‌వర్క్స్, రెవిన్యూ, హార్టికల్చర్, ఎలక్ట్రికల్, ఇతర విభాగా ధిపతులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

# కింద పడిపోయినట్టు నటించారు

**-సైకిల్ గ్యాప్‌లో సెల్‌ఫోన్ లేపేశారు**

**-సెల్‌ఫోన్ దొంగతనంలో కొత్తపంథా అనుసరించిన 'తోడు దొంగలు'**

**హైదరాబాద్, మే15, ప్రభాతవార్త:** సాయం చేయమనే వంకతో ఒక వ్యక్తిని పిలిచిన ఇద్దరు తోడు దొంగలు కన్ను మూసి తెరిచేలోపు సెల్‌ఫోన్ తస్కరిం చిన వైనం బంజారాహిల్స్ ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, లంగర్‌హౌస్ ప్రాంతానికి చెందిన యం.విజయ్‌కుమార్ ఓయూ కాలనీలో బంధువుల ఇంటికి వెళ్ళాడు. అక్కడ పని ముగిసిన అనంతరం హోటల్ భీమాస్‌కు వెళ్ళి టిఫిన్ చేసి పార్కింగ్ లాట్‌లో ఉన్న కారు తీసేందుకు తిరిగి వస్తుండగా, ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి అతడి ఎదురుగా కింద పడి పోయినట్లు నటించారు. వారిలో ఒక వ్యక్తి రోడ్డుపై పడుండగా, రెండో వాడు మోటర్ సైకిల్‌ను లేపే ప్రయత్నం చేస్తూ విజయ్‌కుమార్‌ను సాయం కోరాడు. బైక్ లేపీ లేపగానే ఆ వ్యక్తులిద్దరూ హుటాహుటీన వేగంగా దూసుకెళ్ళారు. వారు వెళ్ళిన తరువాత తన జేబులో చూసుకోగా విజయ్ కుమార్‌కు తన సెల్‌ఫోన్ మాయమయిన విషయం అర్థమైంది. చుట్టుప్రక్కల ప్రాంతాలు వెతికినా లాభం లేకపోవడంతో, బాధితుడు బుధవారం ఫిలింనగర్ పోలీసులను ఆశ్రయించాడు. తనని సాయం కోరిన తోడు దొం గలే తన ఫోన్‌ను తస్కరించారని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఐపీసీ 420,379 సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చార్మినార్, మే 15 ప్రభాతవార్త :**

విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 16వ తేదీ గురువారం ఉదయం 7.30 నుంచి 8 గంటలు వరకు నంది నగర్, ఎస్‌పి నగర్, మురారీనగర్, అత్తాపూర్, రాంబాగ్ ప్రాంతాలలో, 8 నుంచి 8.30 గంటలు వరకు కిల్వత్, శాలిబండ, శాలిబండ నూయ రోడ్డు, బేలా, హరిబౌలి, 8.30 నుంచి 9 గంటలు వరకు సంజావిని ఈ హిల్స్, నలందనగర్, సిరిమల్లె నగర్, ఏజికాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు వెల్లడించారు.

# కాయ్‌రాజా...కాయ్..!

**గ్రేటర్‌లో జోరుగా సాగుతున్న బెట్టింగ్**

**లోక్‌సభ అభ్యర్థుల గెలుపు,ఓటములపై అంచనా**

**ఏపి ఫలితాలపైనా పందెం కాస్తున్న నగరవాసులు**

**చేతుల మారతున్న కోట్లాది రూపాయలు**

**హైదరాబాద్, మే 15, ప్రభాతరవార్త:**

బెట్టింగ్, బుకీలు అనే మాటలు క్రికెట్ పోటీల సమయంలో తరచుగా వినబడుతుంటాయి. క్రికెట్ పోటీలపై కాసే బెట్టింగ్‌లలో ప్రపంచ వ్యాప్తంగా కోట్లు చేతులు మారుతుంటాయి. కానీ ప్రస్తుతం లోక్‌సభ, ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో ఎవరు అధికారంలోకి వస్తారు..? ఎక్కడెక్కడ ఎవరు గెలుస్తారు..? ఏపీలో కాబోయే ముఖ్యమంత్రి ఎవరంటూ బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. ఇలా హాట్ సీట్లపై బెట్టింగ్‌లు కట్టిస్తూ కమీషన్లు గుంజుకుంటున్నారు బెట్టింగ్ రాయుళ్లు. ఈసారి ఎన్నికలు హోరాహోరిగా సాగడంతో ఇటు తెలంగాణలో, ఆటు ఏపీలో బెట్టింగ్‌ల జోరు పెరిగింది. తెలంగాణలో ప్రధాన పార్టీల నుండి ప్రముఖులు పోటీ చేస్తున్న పార్లమెంట్ నియోజకవార్గలు హాట్ సీట్లుగా మారాయి. ఆయాస్థానాల్లో అభ్యర్థుల గెలుపోటములపై స్థానికంగానే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా భారీ మొత్తంలో బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలన్నీ పూర్తి స్థాయిలో ఒకటికి రెండు సార్లు ఆలోచించి..అన్ని సమీకరణాలు లెక్కలోని తీసుకుని గెలుపుగుర్రాలకే టికెట్లు ఇచ్చి బరిలో నిలిపాయి. చాలా స్థానాల్లో బిజెపి-కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య నువ్వానేనా అన్నట్లుగానే పోటీ నెలకొంది. కొందరు లక్షల్లో పెందెం కాస్తే ..మరికొందరు ఫలితం తెలిసిన తర్వాత ఓడిపోయిన వారు దావత్ ఇవ్వాలనే షరతులు పెట్టుకుంటున్నారు. పోలీసులు ఇతర ప్రభుత్వ యంత్రాంగం ఎన్నికల పనుల్లో బిజీగా ఉండటంతో వీటిపై దృష్టి సారించలేకపోతున్నారు. ఇదే అదునుగా బెట్టింగ్ రాయుళ్లు విజృంభిస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలోకూడా ఏపీలో ఎవరుగెలుస్తారో అనే అసక్తి ఎక్కువగా ఉండటంతో నగరంలో ఏపీ రాజకీయాలపై బెట్టింగ్‌లు కాస్తున్నారు.



బెట్టింగ్ ఇలా..

సాధారణంగా క్రికెట్‌లో ఎవరు టాస్‌గెలుస్తారు..ఏబాల్‌కు సిక్స్ ఫోర్ కొడతారు లాంటి పలు ఆంశాలపై బెట్టింగ్ కాస్తారు. కానీ ఎన్నికల సమయంలో అనేకరకవాలైన అంశాలపై పందాలు కాస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు సిట్టింగ్‌సీట్లపై, తర్వాత ఏ నాయకుడికి టికెట్ వస్తుంది రెబల్స్‌గా ఎవరు నామినేషన్ వేస్తారు..ఎవరు బరిలో నిలుస్తారు అనే అంశాలపై బెట్టింగ్‌లు సాగగా..అసెంబ్లీ పోలింగ్ ముగి సినాక ఏప నియోజ వర్గంలో ఏనాయకుడు గెలుస్తాడు?.. ఎంత మెజారిటీ వస్తుంది..? తెలంగాణలో ఏపార్టీ అధికారంలోకి వస్తుంది..? కాంగ్రెస్ అధికా రంలోకి వస్తే ఎవరు ము ఖ్యమంత్రి అవుతారు అనే అంశాల్లో పందాలు జోరుగా పందాలు సాగాయి. ప్రస్తుతం బిజెపి ఎన్నిక సీట్లు గెలు స్తుంది, కాంగ్రెస్ ఎన్నిసీట్లు గెలుస్తుంది. సెంట్రల్‌లో ఏపార్టీ అధికారంలోకి వస్తుంది. ఆంధ్ర ప్రదేశ్‌లో కూటమి గెలుస్తుందా ..వైసిపి గెలుస్తుందా. .కూటమి గెలిస్తే పవన్ కళ్యాణ్‌స్థానం ఏంటీ, ఎవరు ముఖ్యమంత్రి అవుతారన్న కోణంలో పందాలు వేసుకుంటున్నారు.

ఈపందాల్లో పలుకుబడి ఉన్న నేతల నుండి ద్వితీయ శ్రేణి నాయకులు, రాజకీ యాలంటే ఎంతో అసక్తి చూపే వివిధ వార్గాలకు చెందిన వ్యాపారవేత్తలు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు.

## కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో

# ఎవరికి వారే దీమా

**-ఫలితాల కోసం ఎదురుచూస్తున్న నేతలు**



**కంటోన్మెంట్, మే 15 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో తామే విజయం సాధిస్తామని ఎవరికి వారే దీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 13న లోక్ సభ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికలు జరుగగా 2 లక్షల 53 వేల 706 ఓటర్లు ఉండగా 65 వేల 753 పురుషులు, 65 వేల 173 స్త్రీలు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 51.61 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. ప్రధాన పార్టీలకు చెందిన కాంగ్రెస్ అభ్యర్థి ఎన్.శ్రీగణేష్, బిఆర్ఎస్ అభ్యర్థి నివేదిత, బిజెపి అభ్యర్థి డాక్టర్ వంశా తిలక్‌లతో పాటు మరో 12 మంది ఎన్నికల బరిలో నిలిచారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందు వల్ల రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వంతోనే సాధ్యమౌతుందని, అందు వల్ల తామే బారీ మెజార్టీతో విజయం సాధిస్తామని కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్‌తో పాటు కాంగ్రెస్ ఇన్‌ఛార్జిలు, అభిమానులు దీమా వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా బిఆర్ ఎస్ అభ్యర్థి నివేదిత తన తండ్రి దివంగత ఎమ్మెల్యే సాయన్న కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజలకు 30 సంవత్సరాల పాటు సేవలు అందించారని, అదే విధంగా తన చెల్లి 2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో 17 వేల పై చిలుకూ విజయం సాధించగా 3 నెలల వ్యవధిలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెంది. తన తండ్రి సాయన్న చేసిన సేవలను, చెల్లి మృతితో ప్రజలు తమపై నమ్మకం, సానుభూతితో తమకే ఓట్లు వేశారని, ఈ ఎన్నికల్లో తామే విజయం సాధిస్తామని నివేదితతో పాటు బిఆర్ఎస్ అధి ష్టానం కార్యకర్తలు, అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. బిజెపి అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన డాక్టర్ వంశా తిలక్ ప్రధాన మంత్రి దేశానికి చేసిన సేవలు, అభివృద్ధి, అయోధ్య రామమందిర నిర్మాణం వంటి సేవలను దృష్టిలో పెట్టుకొని కంటోన్మెంట్ ప్రజలు బిజెపిని గెలిపిస్తారని వంశా తిలక్ వ్యక్తం చేస్తున్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో 2 లక్షల 53 వేల ఓటర్లు ఉన్నప్పటికి కేవలం 51 శాతం పోలింగ్ జరగడంతో ఈ ఎన్నికల్లో తాము విజయం సాధిస్తామని ఎవరికి వారే దీమా వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా అతి తక్కువ పోలింగ్ జరగడంతో ఏప వార్డులో ఏప పార్టీకి ఓట్లు వచ్చాయని అభ్యర్థులు, ఆ పార్టీ నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు విజయం సాధిస్తారో, ఎవరి భవితావ్యం ఏమిటో వచ్చే నెల 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

## బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో గంజాయిని సమూలంగా అరికట్టాలి : ఇబ్రాం శేఖర్

**సరూర్‌నగర్, మే 15 ప్రభాతవార్త:**

గంజాయిని అరికట్టడంలో పోలీసులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ కోరారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా యువత గంజాయికి బానిసై ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో మాదిరిగానే ఈ ప్రభుత్వంలో కూడా యధేచ్ఛగా గంజాయి రవాణా, యువత గంజాయికి అలవాటు పడడం జరుగుతుందని ఆయన విమర్శించారు. గంజాయిని అరికడుతామని ప్రకటించిన సిఎం రేవంత్‌రెడ్డి దానిని అమలు చేయడంలో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయి దొరకని గ్రామం అంటూ లేదనీ అంతటా గంజాయి లభ్యమవుతున్నదని ఆయన వెల్లడించారు. ఇటీవల బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో ఇద్దరు యువకులు గంజాయికి బానిసలై చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఓట్ల కోసం వచ్చే నాయకులు గంజాయిని అరికట్టడంలో అదే విధంగా దానికి బానిసలైన యువతను మార్చే బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో గంజాయికి బానిసలైన వారి జాబితాను తయారు చేసి పోలీసులచే వారికి కౌన్సిలింగ్ ఇప్పించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, పోలీసులు సమీక్ష చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## శ్రీ లక్ష్మి గణపతి దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



శ్రీ లక్ష్మి గణపతి దేవాలయంలో వార్షికోత్సవ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి..

**నేరెడ్‌మెట్ మే15 ప్రభాతవార్త:**

మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కళ్యాణ్‌నగర్‌లో ఉన్న శ్రీ లక్ష్మి గణపతి దేవాలయంలో నిర్వహించిన వారి ్కోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ లక్ష్మి గణపతి దేవాలయం భక్తుల కోరికలు తీర్చే దేవుడిగా స్థానిక భక్తులు కొలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్యాం సుందర్, రామచంద్రమూర్తి, భాస్కర రావు, వెంకటరమణ, రాధాక్రిష్ణ, భీమశంకర్, శివరామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

**-చార్మినార్ ఎడిఇ విజయ్ కుమార్ కులకర్ణి**

**చార్మినార్, మే 15 ప్రభాతవార్త :**

పాతబస్తీ ప్రజలు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని టిఎస్‌పిడిసిఎల్ చార్మినార్ అసిస్టెంట్ డివిజినల్ ఇంజనీరు విజయ్‌కుమార్ కులకర్ణి కోరారు. చార్మినార్, మొగల్‌పుర, హుస్సేనీఆలం విద్యుత్ స్టేషన్ల పరిధులలో 67,730 మంది విత్యుత్ వినియోగదారులు ఉన్నారని, ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండ విద్యుత్ సేవలు అందిస్తున్నామని ఆయన తెలియజేశారు. వేసవి కాలం సందర్భంగా పాతబస్తీలో విద్యుత్ వినియోగం పెరిగిందని, చార్మినార్, మొగల్‌పుర, హుస్సేనీఆలం విద్యుత్ సెక్షన్ల పరిధులలో దాదాపు మూడు వందల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని ఆయనతెలియజేశారు. విద్యుత్ వినియోగం పెరిగినప్పటికి వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండ అన్ని చర్యలు తీసుకున్నామని, పాతనగరానికి చెందిన వినియోగదారులు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి తమ సహకారాన్ని అందించాలని చార్మినార్ ఎడిఇ విజయ కుమార్ కులకర్ణి కోరారు.

# మార్చురీ నుంచి మెడికల్ కాలేజి దాకా...

**-మర్మమైన దందా -మిస్సింగ్ కేసుగా మొదలు**

**-గుర్తు తెలియని శవాలుగా ముగింపు**

**-శవాలతో చీకటి వ్యాపారం**

**-అనాటమీ ల్యాబ్‌లో డెడ్‌బాడీలు ఒకనాటి మిస్సింగ్ కేసులు**

**-దర్యాప్తుల్లో పడిపోయిన ట్రేసింగ్ రేషియో**

**హైదరాబాద్, మే15, ప్రభాతవార్త:**

డాక్టర్ కాబోయే విద్యార్థుల చదువు కోసం తన శరీరం ఉపయోగపడాలని, అదే తమ చివరి కోరిక అనీ ఆదర్శవంతులైన వాళ్ళు తమ పిల్లలకు చెప్పి ఒప్పించి, తాము కాలం చేసిన అనంతరం మెడికల్ కాలేజీలకి తమ మృతదేహాలను ఎన్నో సందర్భాలలో దానం చేసేవారు. సాటి మనిషికోసం తన మరణానంతరం కన్ను, ఊపిరి తిత్తులు వంటి అవయవ దానం చేసి పుణ్యంకట్టుకునే క్రమంలో ఇతరుల చదువుకోసం తన మృతదేహం ఉపయోగపడాలని కోరుకునేవారు చాలా అరుదుగా ఉంటారు. కానీ ఆ పరిస్థితిని దిగజారుస్తూ మార్చురీ నుంచి మెడికల్ కాలేజీలకు గుర్తు తెలియని శవాలుగా ముద్ర వేయించుకున్న డెడ్ బాడీలను విక్రయించే దందా గుట్టు చప్పుడు కాకుండా జరుగుతోంది. నగరంలో గత ఏడాది 1547 గుర్తు తెలియని శవాలు లభ్యమయ్యాయి. ఈ సంవత్సరంలో గత 4 నెలలుగా అధికార పూర్వకంగా 520 నుంచీ 550కి పైగా గుర్తు తెలియని శవాలు లభించాయి. వాటిలో చాలా వరకూ మిస్సింగ్ కేసుగా మొదలై చివరకు గుర్తు తెలియని శవాలుగా ముద్ర వేయబడుతున్నాయి. ఇంట్లో పిల్లల ఆధరణకి నోచుకోని వయసు మీద పడిన వాళ్ళు, అల్జీమర్స్ వ్యాదిగ్రస్థులు, అలిగి ఇల్లొదిలి వెళ్ళిపోయేవారు, ఇంటి నుండి బయటకు గెంటేయబడినవారు, తన పేరు ఊరు మార్చుకుని దేశదిమ్మరిల సమూహంతో తిరుగుతూ కొత్త జీవితాలను సృష్టించుకునేవారు, డ్రగ్స్‌కి అలవాటు పడ్డవారు, ఆత్మహత్యా ప్రయత్నం చేసే మానసిక రోగులు, ప్రమాదవశాత్తు వేగంగా వెళ్ళే రైళ్ళలోంచి పట్టుదప్పి కింద పడిపోయినవారు తదితర సందర్భాలలో మిస్సింగ్ కేసులలో చేరిపోయినవారు కోకొల్లలు ఉన్నారని పోలీసు శాఖ వారు పేర్కొన్నారు. వారిలో రోడ్డు మీద భిక్షాటన చేసుకుంటూ, లేదా వేరే జీవితాన్ని వెతుక్కుని కొందరు వెళ్ళిపోతే అనుకోని సంఘటనలలో కొందరు ప్రణాలు కోల్పోతున్నారని తెలిపారు. వారిలో కొందరి జీవితాలు మిస్సింగ్ కేసుతో మొదలై, గుర్తు తెలియని శవాలుగా ముగుస్తున్నాయంటున్నారు. కానీ ఇలా నగరంలో లభ్యమైన గుర్తు తెలియని శవాలు మెడికల్ విద్యార్థుల సర్జికల్ బ్లేడ్ల వేటుకు, వారి చదువుకు బాసటగా నిలుస్తున్నాయి. సాధ్యమైనంత వరకూ ఎన్నో గుర్తు తెలియని శవాలు మెడికల్ కాలేజిలో అనాటమీ ల్యాబ్‌లో విద్యార్థుల ప్రాక్టికల్స్‌లో ప్రత్యక్షమవుతున్నాయి. ఇవన్నీ వారికి పలు ఆసుపత్రుల మార్చురిల నుంచి విక్రయించగా లభించినవి. శవాన్ని విక్రయిస్తే వచ్చే డబ్బు పెద్ద మొత్తంలో ఉండడం వల్ల ఒక చీకటి దందా మొదలై గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతోంది. విద్యార్థుల పరిశోధన పూర్తయిపోయిన అనంతరం పోలీసుల



ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ అధికారులు మూట కట్టిన శవాలను స్మశానవాటికలో సామూహిక ఖననం చేయడంతో కాలగర్భంలో కలిసి పోతున్నాయి.

**అనాటమీ క్లాస్ జరుగుతోందీ అంటే మిస్సింగ్ కేసులు పెరుగుతున్నట్లే:**

మెడిసిన్ చదివే విద్యార్థులు పరోక్షంగా ఎన్నో చావులకు కారకులుగా మారుతున్నారు. అందుకు కారణం పలు ఆస్పత్రిలలో జరిగే మెర్సీ కిల్లింగ్ నుంచీ, గుర్తు తెలియని శవాలు లభ్యమైనప్పుడు మెడికల్ కాలేజిలలో జరిగే అనాటమీ ప్రాక్టికల్స్‌ద్వారా వారు చదువుకోవడమే. మెడికల్ కాలేజిలో అనాటమీ ప్రాకికల్ క్లాసులు జరుగుతున్నాయి అంటే మిస్సింగ్ కేసులు పెరిగినట్లేనని సత్యహరిశ్చంద్రా ఫౌండేషన్ వారు చెబుతున్నారు. లెక్కకు మించి మెడికల్ కాలేజిలు పెరిగిపోవడం వల్ల మిస్సింగ్ కేసులలో ట్రేసింగ్ రేషియో పడిపోతుందని తెలిపారు. ఎన్నో మిస్సింగ్ కేసులలో తెలంగాణ పోలీసు శాఖతో కలిసి పని చేసే ఈ ఫౌండేషన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, మార్చురీ నుండి మెడికల్ కాలేజిలకు గుట్టు చప్పుడు కాకుండా చేర్చే శవాల చీకటి వ్యాపారంలో మెడిసిన్ చదువుకునే విద్యార్థులతో పాటూ, శవాలను విక్రయించే మధ్యవర్తులు, డాక్టర్ల వరకూ అంతర్గతంగా చీకటి కమ్మిన వ్యవస్థలో కూరుకుపోయారంటున్నారు. నగరంలో అధికారికంగా 11 మెడికల్ కాలేజిలు ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా 52 మెడికల్ కాలేజిలున్నాయి. ఎన్నో సందర్భాలలో మెడికల్ కాలేజీల యాజమాన్యం మార్చురీ నుంచి శవాలను కొనుగోలు చేసిన సందర్భాలున్నాయి. వాటిలో ప్రైవేటు కాలేజిలు 8 ఐతే, మూడు ప్రభుత్వ కళాశాలలున్నాయి. కాలేజిలో 10 మంది మెడికల్ విద్యార్థుల ప్రాక్టికల్స్‌కు ఒక శవం అవసరమవుతుంది. ఈ లెక్కన 100 మంది విద్యార్థులకు 10 శవాలు అవసరమవుతాయి.

**బ్రతికున్నప్పుడు నరికితే మర్డర్:**

బ్రతికున్నప్పుడు నరికితే మర్డర్. కానీ గుర్తు తెలియని శవాల అవయవాలని నరికి మార్చురీ నుండి మెడికల్ విద్యార్థులకు విక్రయిస్తున్నారు. కేవలం తల కావాలంటే రూ.50వేలకు దొరుకుతుంది. ఇప్పుడు రేటు పెరిగిందని తెలుస్తోంది. అదే విధంగా ఒక్కో అవయవానికీ ఒక్కో రేటు ఉంటుంది. లైవ్ పేషెంట్స్‌ని మాయం చేసే హాస్పిటల్ మాఫియాలు రహస్యంగా తమ చీకటి వ్యాపారాన్ని కొనసాగించిన సందర్భాలు ఉన్నాయి. నయమయిపోయే రోగులను కావాలని బ్రెయిన్ డెత్ చేసి మరీ కంటికి కనిపించని వారి దందాను నడిపిస్తుంటారు. ఒక ఆసుపత్రికి గుర్తు తెలియని శవం వస్తే 24 గంటల సమయంలో డీకంపోజింగ్ స్టేజిలో శవాల ముఖాలు గుర్తుపట్టలేని విధంగా మారతాయి. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మెడికల్ కాలేజికి శవం అప్పగిస్తే, పద్దతి ప్రకారం పోస్టుమార్టం నిర్వహించిన తరువాతే ఇవ్వాలి. కానీ ఆ వ్యక్తి చనిపోయిన విధానంలో హత్యగా నిరూపితమై కేసయ్యే అవకాశం ఉండడంతో చాలా సందర్భాలలో కేవలం పేపర్ల వరకు మాత్రమే పోస్టుమార్టం నమోదవుతుంది తప్ప యధార్థంగా జరగదని గతంలో తేలింది. కారణం గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో, లేదా ప్రమాదానికి గరై ఆసుపత్రిలో చేరితే అతడిని అనాథ శవంగా మార్చి విక్రయించేందుకు కొన్ని కళ్ళు ఎదురు చూస్తూ ఉంటాయి. ఈ మాఫియాకి మెడికల్ కాలేజిలతో పాటూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులతో సంబంధాలు ఉండడంతో కంటికి కనిపించని దందాను నడిపిస్తున్నారు. వీరి ద్వారా పలు రాజకీయ పార్టీలకు ఫండింగ్ అందడంతో నేరపూరితమైన ఈ దందాని నివురుగప్పిన నిప్పులా లీగల్‌గా చేస్తున్నారు. సాధ్యమైనంత వరకూ ఇంటి నుండి ఎవరూ మిస్సవ్వకుండా, తప్పిపోకుండా జాగ్రత్త పడడం మిస్సింగ్ కేసులని అరికట్టే పరిష్కార మార్గంలో తొలి మెట్టు అని పోలీసు శాఖవారు చెబుతున్నారు.

## 18 నుండి జిల్లెలగూడ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**సరూర్‌నగర్, మే 15 ప్రభాతవార్త:**

ఉత్తర ద్వారం గల అరుదైన ప్రాచీన దేవాలయంగా ప్రసిద్ధి చెందిన బాలాపూర్ మండలంలోని జిల్లెలగూడ గ్రామంలోనున్న శ్రీ మత్స్యావతార వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 18వ తేదీ నుండి శ్రీవారి అధ్యయనోత్సవ సహిత పాంచాహ్నిక బ్రహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. పురాతనమైన ఈ దేవాలయంలో స్వామి బ్రహ్మోత్సవాలను చాలా కాలం నుండి వైభవంగా నిర్వహిస్తుంటారు. ప్రతి సంవత్సరం వేసవి కాలంలో వచ్చే ఈ బ్రహ్మోత్సవాలకు చాలా ప్రత్యేకత ఉంది. అయితే ఈ సంవత్సరం కూడా ఆలయంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఆలయ ఇఒ వై. శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 24వ తేదీ వరకు వారం రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 18న శనివారం విశ్వక్సేన పూజ పుణ్యాహవాచనం, పుట్ట బంగారం, అంకురార్పణ హోమం, 19న ఆదివారం అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం, గరుడ ముద్ద బలిహరణం, 20న సోమవారం సాయంత్రం తిరు కళ్యాణోత్సవం, హనుమత్ వాహన సేవ, 21న విష్ణు సహస్రనామ పారాయణం, 22. బుధ వారం సాయంత్రం రథ ప్రతిష్ట, రథోత్సవం, 23న గురువారం మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, అమృతోత్సవం, 24న శుక్రవారం శత ఘటాభిషేకం, శేష వాహన సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయి. అదే రోజు సాయంత్రం రుత్విక్ సన్మానంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని తరించాలని ఇఒ శ్రీనివాస్‌రెడ్డి కోరారు.



జిల్లెలగూడలోని శ్రీవారి దేవాలయం


## బోరబండలో దారుణ హత్య

**-మృతుడు సినిమా పరిశ్రమలో మేకప్ మేన్‌గా గుర్తింపు**

**హైదరాబాద్, మే15, ప్రభాతవార్త:** ఒక యువకుడిని గుర్తు తెలియని దుండుగలు కిరాతకంగా హత్య చేసిన వైనం బోరుబండ ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, బోరుబండలోని కార్మికనగర్ ప్రధాన రహదారి వద్ద నిమ్స్ మైదానంలో గుర్తు తెలియని యువకుడు విగత జీవిగా రక్తపు మడుగులో పడున్నాడు. బుధవారం ఉదయం అటుగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న స్థానికులు అతడిని గమనించి, తక్షణమే పోలీసులకు సమాచారమందించారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఆర్ నగర్ పోలీసులు హత్యకు గురైనది సినిమా ఇండస్ట్రీలో మేకప్ ఆర్టిస్టుగా పని చేసే చుక్కా చెన్నయ్య(30) గా గుర్తించారు. వెంకటగికి చెందిన చెన్నయ్య మంగళవారం అర్ధరాత్రి హత్యకు గరైనట్లు తెలిసింది. ఈ మేరకు ఏసీపీ వేంకటరమణ బోరుబండ క్లూస్‌టీమ్, ట్రాకర్ డాగ్స్ సహాయంతో హత్య జరిగిన ప్రదేశంలో ఆధారాలను సేఖరించారు. మృతుడి చేతిలో గల సెల్‌ఫోన్ ఆధారంగా విచారణ ప్రరంభించారు. అతడి ఒంటిమీద కత్తిపోట్లు ఉండడం గమనించిన పోలీసులు, జరిగిన ఘటనను హత్యగా పరిగణిస్తున్నారు. అక్కడే ఉన్న బిల్డింగుల వాచ్‌మేన్‌లతో పాటూ స్థానికులను కూడా హత్యపై విచారిస్తున్నారు. గుర్తుతెలియని దుండుగలు కత్తులతో దాడి చేసినట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసు ట్రాకర్ డాగ్స్ వాసన పసిగడుతూ నిందితులు పరారయిన దిశగా వంద మీటర్ల మేరకు వెళ్ళాయి. అనంతరం జనసంచారం వల్ల వారి ఆచూకీ కనుమరుగవ్వడంతో పోలీసు డాగ్ దిశని మార్చలేదు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు. సీసీ టీవి ఫుటేజిలను పరిసీలించి నిందితులు ఎవరనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

## మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన సుధాకర్‌రావు

**జిల్లెడు చౌదరిగూడ, మే 15,(ప్రభాతవార్త):** బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్‌లను బుధవారం బిజెపి చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ సుధాకర్‌రావు మర్యాదపూర్వకగా కలిశారు. ఈ సందర్భంగా సుధాకార్‌రావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికలపై చర్చించారు. తమ పా ర్టీకి అత్యధిక మెజారిటీ వస్తుందని ఆయన ఆశా భావం వ్యక్తం చేశారు. పార్టీ అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గూడ వెంకట స్వామి, తాదురి రమేష్, మంగలి అంజనేయులు, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.



కిషన్‌రెడ్డితో మచ్చా సుధాకర్‌రావు

## బీఆర్‌ఎస్ గెలుపు కోసం కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు

**ఘట్‌కేసర్, మే 15, ప్రభాతవార్త:** లోక్‌సభ ఎన్నికలలో బీఆర్‌ఎస్‌పార్టీ అభ్యర్థి గెలుపుకోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని మున్సిపల్ బీఆర్‌ఎస్‌పార్టీ ప్రధానకార్యదర్శి బర్ల హరిశంకర్ అన్నారు. ఘట్‌కేసర్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానానికి పోటీచేసిన బీఆర్‌ఎస్‌పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు గత నెలరోజులుగా ఎంతో కష్టపడి పని చేశారని ఆయన పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి గెలుపుకోసం నిత్యం ప్రచారం చేసి ఆహర్నిషలు శ్రమించిన పార్టీ శ్రేణులందరికి ధన్యవాదాలు తెలియజేసు _న్నట్లు హరిశంకర్ పేర్కొన్నారు.

## కార్పొరేట్ కళాశాలల్లో 30లోగా దరఖాస్తు చేసుకోవాలి

### షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎన్.మల్లేశం

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** కార్పొరేట్ కళాశాలల్లో మే 30లోగా దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎన్.మల్లేశం పేర్కొన్నారు.2024-25 విద్యా సంవత్సరానికి గాను కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రవేశానికి ఈ మే 15 నుండి 30 లోగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు.ఎస్సి,ఎస్టీ,బిసి మైనార్టీ ,ఇబిసి విద్యార్థులు తెలంగాణ ఈపాస్ అనే వెబ్‌సైట్ ద్వారా సంబంధిత ధ్రువ పత్రాలతో దరఖాస్తులు రిజిస్టర్ చేసుకోవాలన్నారు.ఈ అవకాశం మార్చి 2024లో పదవ తరగతిలో ఉత్తీర్ణులు అయి జిపిఏ 7.0 ఆపైన సాధించిన విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు.కార్పొరేట్ కళాశాలో ప్రవేశానికి ప్రభుత్వ పాఠశాలలో,ఎయిడెడ్ పాఠశాలలో,బెస్ట్ అవైలేబుల్ పాశాలలో,కస్తూర్బా పాఠశాలలో గురుకులాల్లో చదివిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. విద్యార్థులు,ఆన్‌లైన్ ద్వారా తమ పేర్లను తక్షణమే నమోదు చేసుకోవలసిందిగా ఆయన తెలిపారు.

## ఘనంగా మేరీ ఫాతిమా మాత వేడుకలు

**కొత్తూర్, మే 15, ప్రభాతవార్త :** ప్రతి సంవత్సరం కులమతాలకతీతంగా వైభవంగా జరుపుకునే వేడుకలు మేరీ ఫాతిమా మాత మహోత్సవ వేడుకలు అని చర్చ్ ఫాదర్ అన్నారు. కొత్తూర్ పురపాలకలోని ఫాతిమాపూర్‌లో మేరీ ఫాతిమా మాత ఉత్సహ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని చర్చిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... ఫాతిమాపూర్‌లో మేరీ మాత సుమారు 75సంవత్సరాల క్రితం ఇక్కడ తెలిసిందన్నారు. జీవితంలో మనకు అమ్మ పాత్ర ఎంత ముఖ్యమో మనందరికి తెలుసని దేవుడు కూడా మనకు ఒక తల్లిని ఇచ్చాడని, ఆమె మరియా మాత అన్నారు. ఆ మరియా మాతే ఫాతిమా మాతగా కొనియాడుతూ ప్రతి ఏడాది ఈమహోత్సవాలను ఘనంగా నిర్వహించడం అనవాయితీగా వస్తుందన్నారు. ప్రత్యేకంగా కొనియాడే పండుగ ఫాతిమా మాత తిరునాళ్ల మహోత్సవ పండుగ అని ఆ పండుగ వైభవంగా జరుగుతుందన్నారు. కుల,మత జాతి బేదం లేకుండా దేవుని బిడ్డలుగా భరతమాత పుత్రులుగా శాంతి సామరస్యాలతో జీవించాలని ఆశీర్వచనాలు అందించారు. ఈకార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న 17 పశువుల పట్టివేత

**ఘట్‌కేసర్ రూరల్, మే 15, ప్రభాత వార్త:** అక్రమంగా 17 పశువులను తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సంఘటన వివరాలు స్థానిక పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. పోచారం ఐటీ కారిడార్ పోలీసులు వరంగల్ హైవే అన్నోజిగూడ డీ మార్ట్ వద్ద వాహనాలు తనిఖీ కార్యక్రమం చేపట్టగా నగరం వైపు వెళ్తున్న బోలోర వాహనం ( ఎపి 39 యుఎస్ 8369 )ను పోలీసులు తనిఖీ చేయగా అందులో 13 ఎద్దులు, 4 ఆవులున్నట్లు తెలిపారు. వీటిని ఏపిలోని శ్రీకాకుళం నుండి నగరంలోని బహుదూర్ పుర జంతు వధశాలకు తరలిస్తున్నట్లు వాహన డ్రైవర్ ఎం. మణీంద్ర (25) పోలీసులకు తెలిపారు. నగరంలోని జంతు వధశాలకు తరలించేందుకు శ్రీకాకుళం జిల్లా నారాన్న పేట మండలంలోని తిలారా పశువుల సంత నుండి పశువులను తీసుకువస్తున్నట్లు వాహన డ్రైవర్ తెలిపినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన డ్రైవర్ మణీంద్ర అనకాపల్లి జిల్లా చౌడవరం మండలం మంచిర్యాలపాలెంవాసిగా తెలిపాడు. వాహనంతో పాటు పశువులను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీ పోలీసులు తెలిపారు.

## అమెరికా నుంచి వచ్చి ఓటు వేసిన శ్రీజకు సన్మానం



శ్రీజను సన్మానిస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, మే 15, ప్రభాతవార్త:** లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయడానికి అమెరికా నుంచి వచ్చిన ఓ యువతీని ఎంపిపి సన్మానించారు. ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడకు చెందిన వీరారెడ్డి కుమార్తె శ్రీజ అమెరికా ఇండియానా రాష్ట్రం చికాగో నగరంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తుంది. ఈనెల 13న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో చౌదరిగూడ పాఠశాలలోని పోలింగ్‌బూత్‌లో ఆమె ఓటు హక్కును వినియోగించుకున్నది. ఈసందర్భంగా ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి బుధవారం ఆమె నివాసానికి వెళ్లి శాలువాతో సన్మానించి అభినందించారు. రెండు నెలల తర్వాత ఆమె చికాగో నుంచి స్వదేశానికి రావాల్సీ ఉండగా ఎన్నికల కోసం ముందుగానే ఇంటికి చేరుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమర్థవంతమైన పరిపాలన అందిస్తూ మూడవసారి తిరిగి ప్రధానిగా బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షిస్తూ శ్రీజ బిజెపికి ఓటు వేసినట్లు తెలిపారు. భారతదేశ ఖ్యాతిని ఖండాంతరాలకు ఇనుమడింపజేస్తూ దేశ విదేశాలలో భారతదేశం పట్ల గౌరవ మర్యాదలు పెరిగేలా తన మార్కు పాలనను అందిస్తున్న మోదీ పాలనకు మద్దతుగా తాను సొంతగ్రామం వచ్చి బిజెపి అభ్యర్థికి ఓటు వేసినట్లు శ్రీజ తెలియజేయడంతో ఎంపిపి ఆమెను అభినందించారు.

## 16వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** ఇంటర్ అడ్వాన్స్ సప్లీమెంటరీ పరీక్షల కు హాజరయ్యే విద్యార్థులు ఈనెల 16వ తేది వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి ఎన్.శంకర్ తెలిపారు.సప్లీమెంటరీ పరీక్షలకు సంబంధిత కళాశాలలో వెయ్యి రూపాయల ఆలస్య రుసుంతో చెల్లించవచ్చునని ఆయన తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు ,కళాశాలల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు తెలంగాణ ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఇంతకు ముందు ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## కిరాణ దుకాణంలో చోరీ

**మేడ్చల్, మే 15, ప్రభాతవార్త :** తాళం వేసిన కిరాణ దుకాణంలో గుర్తు తెలియని దుండగులు చొరబడి నగదును దోచుకెళ్లిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో లింగాల వెంకన్న కిరాణ దుకారం నడిపించుకుంటున్నాడు. ఈ నెల 14 తేదీన రాత్రి అతను షాపును మూసివేసి వెళ్లిన ఆతను 15న ఉదయం వచ్చి షాపు తెరిచి చూడగా అందులో వస్తువులు చిందరవందరగా ఉండటంతో పాటు షాపు వెనుకాల ఉన్న తలుపు తెరిచి ఉన్నది. షాపులో ఉన్న 15 వేల నగదు దోచుకెళ్లారు. ఈ చోరీతో పాటు మరో మూడు ఇండ్లల్లో చోరి జరిగినట్లు తెలుస్తున్నది. కాగా వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నేడు మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

### మండలాల్లో నెలకొన్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపైనే అజెండా

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 15, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11గంటలకు జరుగనుంది. దీనికి సంబంధించి జిల్లా పరిషత్ సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం 11గంటలకు మేడ్చల్ జడ్పీ కార్యాలయం సమావేశ మందిరం హాల్‌లో జిల్లా పరిషత్ చైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని జడ్పీ సిఇఓ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఈ జడ్పీ సర్వసభ్య సమావేశంకు జడ్‌పి వైస్‌చైర్మన్, జడ్పీటీసిలు, ఎంపిపిలు, కోఆప్షన్ సభ్యులు, జిల్లా కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్లు, జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొననున్నారు. ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు సకాలంలో పాల్గొనాలని కోరారు. జిల్లా సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో సర్వసభ్య సమావేశంనకు సకాలంలో విచ్చేయాలని జడ్పీ సిఇఓ దిలీప్‌కుమార్ కోరారు. అదే విధంగ ఈ సర్వసభ్య సమావేశంనకు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు కూడ పాల్గొనే అవకాశం ఉన్నట్లు సమాచారం. జిల్లా పరిధిలోని మండలాల్లో నెల కొన్న సమస్యలపై, అభివృద్ధి పనులపై ఈ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తనున్నారు. జిల్లా స్థాయి అధికారులు అందరు పాల్గొనే విధంగ చూడాలని గత సర్వసభ్య సమావేశంలోనూ సభ్యులు సభలో కోరటం జరిగిన సంగతి తెలిసిందే.

### అయితే జడ్పీలో మారిన రాజకీయ సమీకరణలు..?

జిల్లా పరిషత్ జడ్పీ చైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి గత అసెంబ్లీ ఎన్నికలకు ముందుగానే గత కొన్ని నెలల కిందటనే బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిం దే. జిల్లా పరిధిలో ఐదు మండలాలు ఉండి ఐదు మంది జడ్పీటిసిలు ఎన్నిక కాగా వీరిలో ఒకరు జడ్పీచైర్మన్, మరొకరు వైస్‌చైర్మన్, ముగ్గురు జడ్పీటిసిలుగ కొనసా గటం జరుగుతుంది. అయితే ఈ ఎంపి ఎన్నికలకు ముందుగా మేడ్చల్ జడ్పీటిసి శైలజ కూడ కాంగ్రెస్ పార్టీలో చేరటం జరిగింది. మొదటి నుంచి నుంచి జడ్పీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్‌గ జడ్పీటిసిగా కాంగ్రెస్ నుంచి ఎస్.హరివర్ధన్‌రెడ్డి ఒక్కరే ఉన్న సంగతి తెలిసిందే. ఇక కాంగ్రెస్‌లో జడ్పీచైర్మన్‌తో పాటు జడ్పీటిసిలు ఎస్.హరివర్ధన్‌రెడ్డి, శైలజలు ముగ్గురు కొనసాగుతున్నారు. ఇక జడ్పీ వైస్‌చైర్మన్ బి.వెంకటేశ (బిఆర్‌ఎస్), శామీర్‌పేట జడ్పీటిసి సభ్యురాలు ఎం.అనితలాలయ్య (బిఆర్‌ఎస్)లు ఇద్దరు మాత్రం బిఆర్‌ఎస్ పార్టీలో కొనసాగుతున్నారు. మేడ్చల్ జిల్లా




మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా పరిషత్ కార్యాలయ భవనం

పరిషత్ పరిధిలో ఐదు మంది జడ్పీటిసిలు ఉండగ వీరిలో ఒకరు జడ్పీ చైర్మన్ ఎం.శరత్‌చంద్రా రెడ్డి(కాంగ్రెస్), ఎస్. హరివ రద్దన్‌రెడ్డి (కాంగ్రెస్), శైలజ (కాంగ్రెస్) ఉన్నారు. వైస్ చైర్మన్ బి.వెంకటేశ (బిఆర్‌ఎస్), ఎం.అనితలాలయ్య (బిఆర్‌ఎస్) ఇద్దరు ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో రాజకీయ సమీకరణలు జరిగాయి. అదే విధంగ జిల్లా పరిధిలో ఐదు మండలాలు ఎంపిపిలు ఐదు మంది ఉన్నారు. వీరిలో మేడ్చల్ ఎంపిపి రజితమల్లారెడ్డి (బిఆర్‌ఎస్), శామీర్‌పేట ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు (బిఆర్‌ఎస్), మూడుచింతలపల్లి ఎంపిపి వి.హారికమురళీగౌడ్ (బిఆర్‌ఎస్), కీసర ఎంపిపి ఎం.ఇందిరలక్ష్మీనారాయణ గౌడ్ (కాంగ్రెస్), ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి (బిజెపి)లు కొనసాగుతున్నారు. గత ఐదేళ్ల కిందట ఎంపిపిలుగా జిల్లాలో ఐదు మంది ఎంపిపిలు బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారే గెలుపొందిన సంగతి తెలిసిందే. గత ఏడాదిన్నర క్రితం ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి బిఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి బిజెపిలో చేరటం జరిగింది. ఇటీవల ఎంపి ఎన్నికలకు ముందుగా కీసర ఎంపిపి ఎం.ఇందిరలక్ష్మీనారాయణ గౌడ్ బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరటం జరిగింది. ఇక ముగ్గురు ఎంపిపిలు బిఆర్‌ఎస్, ఒకరు బిజెపి, మరొకరు కాంగ్రెస్ పార్టీలో కొనసాగటం జరుగుతుంది. గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఉండగ జిల్లా మంత్రి హోదాలో మేడ్చల్ స్థానిక ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి పాల్గొనేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మేడ్చల్ ఎమ్మెల్యేగా సిహెచ్ మల్లారెడ్డి పాల్గొనటం జరుగుతుంది. గత జడ్పీ సర్వసభ్య సమా వేశంకు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరు కాలేదు..పాల్గొనలేదు. మరీ ఈ సారి ఈ జడ్పీ సర్వసభ్య సమావేశంనకు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి వస్తారా లేదా అనేది చూడాల్సి ఉంది. జడ్పీ సర్వసభ్య సమావేశంలో స్టేజి ప్రోటోకాల్ నిబంధనలు ఉండటంతోనే గత జడ్పీ సమావేశంనకు ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొనలేదని సమాచారం. ఈ విషయం గత సమావేశంలోనూ చర్చనీయాంశంగ మారింది. మరీ గురువారం జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశంనకు మేడ్చల్ ఎమ్మెల్యేగా సిహెచ్ మల్లారెడ్డి పాల్గొంటారా లేదా అనేది వేచి చూడాల్సిందే మరీ..ఇక ఈ జిల్లా పరిషత్ పాలకవర్గం ఐదేళ్ల పదవీ కాలం కొన్ని నెలలు మాత్రమే ఉన్న సంగతి తెలిసిందే. ఏది ఏమైనా జడ్పీ సర్వసభ్య సమావేశంలో మండలాల్లో నెలకొన్న సమస్యలపై, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై చర్చలు జరిగే అవకాశం ఉందని చెప్పవచ్చు.

## యువత క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

### ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు మెమోంటోలను అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి,మాజీ సర్పంచ్ పెంటయ్య తదితరులు

**పూడూరు, మే 15, ప్రభాతవార్త :** యువత క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని పరిగి ఎమ్మెల్యే,డిసిసి అధ్యక్షుడు టి రామ్మోహన్‌రెడ్డి అన్నారు.గత 20 రోజులుగా పూడూరు మండలం పరిధిలోని తిర్మలాపూర్‌లో గ్రామ మాజీ సర్పంచ్ కమ్లీబాయి పెంటయ్య అద్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన తిర్మలాపూర్ జట్టుకు రూ.50వేలు,ద్వితీయ స్థానం పొందిన పెద్ద ఉమ్మెంతాల్ జట్టుకు రూ.25వేల నగదుతోపాటు మెమెంటోలను బుధవారం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు ఆటల్లో రాణించాలని ఆకాంక్షించారు.గ్రామీణ ప్రాంతాలనుండే యువత మట్టిలో మాణిక్యాల్లా ఆటల్లో రాణించి దేశానికి ప్రాతినిద్యం వహించిన క్రీడాకారులు ఎందరో ఉన్నారని గుర్తుచేశారు.ఆటల్లో చురుకుగా పాల్గొనేవారికి శారీరక దారూఢ్యంతోపాటు మానసికోల్లాంగా ఉండే అవకాశం ఉందని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాద్యక్షులు కడుమూరు ఆనందం,ప్రధాన కార్యదర్శి,మాజీ సర్పంచ్ పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివా స్‌గుప్తా, రాము, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, మండల యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పర్యటించిన విద్యుత్ ఉన్నతాధికారులు

### ఎస్సీ, ఎస్టీ కాలనీలు, బస్తీల్లో పర్యటనలు.. విద్యుత్ సరఫరా, సమస్యలపై ఆరా..



దేవరయాంజాల్‌ఎస్సీ కాలనీ,బస్తీలో పర్యటించిన విద్యుత్ ఉన్నతాధికారులు

**శామీర్‌పేట, మే 15, ప్రభాతవార్త** శామీర్‌పేట విద్యుత్ సెక్షన్ పరిధిలోని దేవరయాంజాల్‌లో, అలియాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని మజీద్‌పూర్, నాగిశెట్టిపల్లి తండలో విద్యుత్ ఉన్నతాధికారులు పర్యటించి విద్యుత్ సరఫరా, విద్యుత్ సమస్యలపై ఆరా తీశారు. బుధవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని దేవరయాంజాల్ ఎస్సీ,ఎస్టీ కాలనీలో విద్యుత్ సమస్యలను తెలుసుకోవటానికి విద్యుత్ ఉన్నత అధికారుల బృందం పర్యటించింది. అదే విధంగ శామీర్‌పేట మండలం మజీద్‌పూర్‌లో ఎస్సీ కాలనీలో, మూడుచింతలపల్లి మండలంలోని నాగిశెట్టిపల్లి తండ ఎస్టీ కాలనీలో పర్యటించి ప్రజలను విద్యుత్ సరఫరా, విద్యుత్ సమస్యల గురించి ఆరా తీశారు. 200విద్యుత్ యూనిట్స్‌లోపు వచ్చె జీరో బిల్లులను వారు పరిశీలించారు. అదే విధంగ ఆయా ప్రాంతల్లో ఉన్న విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాలను సందర్శించిన వారిలో విద్యుత్ మేడ్చల్ ఎస్ఇ శ్రీరాంమోహన్‌రావు, మేడ్చల్ విద్యుత్ డిఇ శ్రీనాథ్‌రెడ్డి, శామీర్‌పేట విద్యుత్ ఎడి ఈఎంవి రమణారెడ్డి, శామీర్‌పేట విద్యుత్ ఎఇ రమేశ్, అలియాబాద్ విద్యుత్ ఎఇ శ్రీనివాస్,సిబ్బంది పాల్గొన్నారు. 24గంటల విద్యుత్ సరఫరాపై, గృహజ్యోతి బిల్లుల లోపాలు, సమస్యలు, విద్యుత్ బిల్లుల ఆలస్యం, పలు విషయాలపై తెలుసుకుని సమస్యలు పరిష్కరిస్తామని తెలిపినట్లు విద్యుత్ సంబంధిత అధికారులు పేర్కొన్నారు.



నాగిశెట్టిపల్లి తండలో పర్యటించిన విద్యుత్ ఉన్నతాధికారులు

## అన్నోజిగూడలో యువకుడు అదృశ్యం

**ఘట్‌కేసర్ రూరల్, మే 15, ప్రభాతవార్త:** యువకుడు అదృశ్యం అయిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ శ్రీ లక్ష్మీ నర్సింహా కాలనీలో నివాసం ఉండే దిలీప్ దౌలత్‌కు ఇద్దరు కుమారులు, కూతురు ఉంది. దిలిప్ దౌలత్ కుమారుడు దయానంద్ (22) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.ఈ నెల 11 వ తేది అర్ధరాత్రి వేళ తన కొడుకు చాలాసేపు ఫోన్ మాట్లాడినట్లు ఫిర్యాదుదారుడు అయిన తండ్రి పోలీసులకు తెలిపాడు.ఉద యం నాలుగు గంటల సమయంలో తండ్రి లేచి చూసేసరికి ఇంట్లో తన కొడుకు కనిపించలేదని దీంతో తన కొడుకు కొరకు బంధువులు, స్నేహితులను వాకబు చేసినా ఆ చూకీ లభ్యం కాలేదని బాధితుడు పోలీసులకు తెలిపినట్లు పోలీసులు తెలిపారు.. కనిపించకుండాపోయిన కొడుకు ఆచూకీ కొరకు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.



యువకుడు దయానంద్ (ఫైల్)



## అక్రమంగా చెరువులో మట్టితవ్వకాలు పట్టించుకోని అధికారులు

**బొంరాస్‌పేట్ ,మే 15, ప్రభాతవార్త** బొంరాస్‌పేట్ మండలం తుంకిమెట్ల గ్రామంఒ ఉన్న చెరువులో అక్రమంగా మట్టితవ్వకాలు నిర వ్వహిస్తున్నారు. ఇటు ఇరిగేషన్ రెవెన్యూ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా జెసిబి సాయంతో టిప్పర్ల ద్వారా ప్రతిరోజు యథేచ్చగా చెరువు మట్టిని తరలిస్తున్నారు. ఈ మట్టి తరలింపులో జేసిబి యజమాని లారీ యజమాని రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులు కావడంతో ఎవరూ కూడా అడ్డుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి వెంటనే ఈ అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేయించాలని రైతులు ప్రజలు కోరుతున్నారు.

## అదుపుతప్పి బీర్లలోడు లారీ బోల్తా



అంతారం స్టేజీ సమీపంలో కిందపడిన బీర్ల లారీ

**షాబాద్, మే 15, ప్రభాతవార్త :** అదుపుతప్పి లారీ బోల్తా పడ్డ సంఘటన షాబాద్ మండల పరిధిలోని అంతారం స్టేజీ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.... ఉదయం రోడ్డు పక్కన లారీ కిందపడి ఉంది. అందులో డ్రైవర్, క్లీనర్‌లకు చిన్నగాయాలు అయ్యాయి. కింద పడ్డ లారీలో బీర్లు ఉండడం గమనించిన వాహనదారులు లారీ వద్దకు చేరుకున్నారు. వెంటనే లారీ డ్రైవర్ పోలీసులకు ఫోన్ చేయడంతో చేవెళ్ల ఎక్సైజ్ ఎస్సై, సిబ్బందితో వచ్చి కింద పడ్డ బీరు కాటన్లను వేరే లారీలోకి లోడ్ చేయించారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ఉపాధ్యాయబృందం, విద్యార్థులు

**కొందుర్గు, మే 15, (ప్రభాతవార్త) :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థులు ఘనంగా సమ్మేళనం జరుపుకున్నారు. బుధవారం నాడు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థిని విద్యార్థులు వారికి బోధించిన అప్పటి ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళానాన్ని ఆనందోత్సవాల మధ్య అప్పటి తిపి జ్ఞాపకాలను ఒక్కొక్కరే వేదికపై గుర్తు చేసుకుంటూ ఆనందంలో మునిగి తెలిపోయారు. ఎవ్వరూ ఎవ్వరూ ఏమి పనులు చేసుకుంటూ జీవితంలో స్థిరపడ్డారో వివరించారు. తాము చదువు నేర్పించిన విద్యార్థులు ఎంతో కష్టపడి ఉన్నత వ్యాపార రంగాలల్లో కొంత మంది రాజకీయ రంగంలో పదవులు పొందటం ఎంతో సంతోషంగా ఉందని పలువురు ఉపాధ్యాయులు పూర్వపు విద్యార్థులను అభినందించారు. ఈ సమ్మేళనంలో ఉపాధ్యాయ బృందం ఎస్.వెంకటయ్య గౌడ్, బుచ్చయ్యగౌడ్, చంద్రయ్య, బీఎంవీ రాజు, రామ్‌కళ్యాణ్‌జీ, రజిత, ఎ.వెంకటయ్య, శ్రీధర్‌రావు, భాస్కర్‌చారి, ఎజాస్ విద్యార్థుల బృందం టి.గోపాల్, సి.చంద్రశేఖర్, కె.ప్రవీణ్, పి.గోపాల్, విక్రంరెడ్డి, అపర్ణ, బోయ శ్రీశైలం, రాజేశ్వరి, సంధ్య, మంగళి యాదయ్య, కుమ్మరి నరేష్, కుతూరి వేణు తదితరులు పాల్గొన్నారు.

## చేపల వల కోసం నీటిలో మునిగి వ్యక్తి మృతి

**తాండూరు, మే 15, ప్రభాతవార్త :** చేపల వల కోసం ఓ వ్యక్తి నీటి గుంతలో దిగి మృతి చెందాడు. ఈ సంఘటన తాండూరు మండలం కరణ్‌కోట్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాంపూర్‌కు చెందిన రాజు నాయక్ అనే వ్యక్తి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, మంగళవారం సాయంత్రం గ్రామ శివారులో ఉన్న ఓ నీటి గుంతలో చేపల కోసం వల వేసి ఉంచాడు. బుధవారం ఉదయం 7గంటల ప్రాంతంలో చేపల కోసం వేసిన వలను తీసుకువస్తానని భార్య సావిత్రిబాయితో చెప్పి ఇంటి నుండి వెళ్లాడు. నీటి గుంత వద్ద వలను తీస్తుండగా రాజునాయక్ ప్రమాదవ శాత్తు నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. గమనించిన రాజునాయక్ సోదరుడు రమేష్ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుని భార్య సావిత్రిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

## మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

**ఘట్‌కేసర్, మే 15, ప్రభాతవార్త:** ఘణాపూర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన వేముల వెంకటమ్మ కుటుంబానికి గౌడ సంఘం నాయకులు ఆర్థిక సాయం చేశారు. గౌడ సంఘం సభ్యులు స్వర్గీయ వేముల మల్లయ్యగౌడ్ భార్య వెంకటమ్మ ఇటీవల చనిపోగా ఆమె కుమారులు మహేశ్వర్‌గౌడ్, వెంకటేశ్‌లకు రూ.5,000లు ఆర్థిక సాయంగా అందజేశారు. మేడ్చల్ కాంగ్రెస్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, గౌడ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు వేముల లక్ష్మయ్యగౌడ్‌ల చేతుల మీదుగా ఐదు వేల నగదును ఇచ్చారు. ఈకార్యక్రమంలో గౌడ సంఘం ఉపాధ్యక్షులు వేముల రంగయ్య, ప్రధానకార్యదర్శి వేముల విక్రమ్‌గౌడ్, కోశాధికారి వేముల రమేశ్‌గౌడ్, డైరక్టర్ డొంకెన రవీందర్‌గౌడ్, సభ్యులు వేముల భాస్కర్‌గౌడ్, వేముల మహేశ్వర్‌గౌడ్, వేముల పరమేశ్‌గౌడ్, వేముల శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.